క్లుప్తంగా

ఎమ్మెల్యేకు రైతుల వినతి



మల్హర్: మండలంలోని రుద్రారంలో గల ఊర చెరువు మరమ్మతులు చేపట్టాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రైతులు కోరారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే మరమ్మత్తులు చేపట్టేలా కృషి చేయాలని కోరారు. కొయ్యూరులో పర్యటించిన ఎమ్మెల్యేను కలిసిన రైతులు తమ సమస్యను త్వరగా పరిష్కరించాలని విన్నవించారు. గత వర్షాకాలం సీజన్‌లో అధిక వర్షాల కారణంగా చెరువు కట్ట తెగిపోయిందన్నారు. దీంతో పొలాలు సాగుకు నోచుకోవడం లేదని, అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చెరువు మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ పాల్గొన్నారు.

తప్పని గ్యాస్ తిప్పలు



టేకుమట్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో భారత్ గ్యాస్ కనెక్షన్ తీసుకున్న లబ్ధిదారులకు ఆ సంస్థ ఏజెన్సీ ముప్పుతిప్పలు పెడుతున్నారు. నెల రోజులుగా గ్యాస్ సిలిండర్లను అందించకపోవడంతో మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరలకు గ్యాస్ సిలిండర్‌ను కొనుగోలు చేసి నష్టపోతున్నారు. భారత్ గ్యాస్ మొగుళ్లపల్లి ఏజెన్సీ నుంచి మండలంలోని పలు గ్రామాలకు గత కొన్ని సంవత్సరాలుగా గ్యాస్‌లను అందిస్తున్నారు. నెల రోజులుగా గ్యాస్ ఏజెన్సీ వారిని ఫోన్‌లో సంప్రదిస్తే స్పందించడం లేదని, ఇప్పటికైనా గ్యాస్ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా గ్యాస్ ఏజెన్సీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు చెరువుల పండుగ

టేకుమట్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా నేడు(గురువారం) మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల్లో నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే చెరువుల పండుగను విజయవతం చేయాలని ఇరిగేషన్ డీఈ అమ్రాపాలి, ఏఈ వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో కోరారు. మండలంలోని అంకుషాపూర్, రామకిష్టాపూర్(టి), సోమనపల్లి, సుబ్బక్కపల్లి, కుందనపల్లి, రాఘవరెడ్డిపేట, వెల్లంపల్లి, పంగిడిపల్లి, రామకిష్టాపూర్(వి), వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో నిర్వహించే చెరువుల పండుగ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

మహాముత్తారం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుభద్ర అధ్యక్షతన రేపు(శుక్రవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనునట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- వేసవి దుక్కులతో మరింత మేలు
- సేంద్రియ ఎరువులు, నల్లమట్టిని వినియోగిస్తున్న రైతులు



మొగుళ్లపల్లి: వానాకాలం పంట సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనావేయగా రైతులు వేసవి దుక్కులు దున్నడానికి చెరువు మట్టిని, పెంటమట్టిని పొలాల్లో చల్లుతున్నారు. పొలంలో ఉన్న చెత్తను, ముళ్ల కంపను తొలగిస్తూ ఖరీఫ్ సాగుకు రెడీ అవుతున్నారు.

వేసవి దుక్కులతో ఉపయోగం

వేసవి దుక్కలతో నేల ఆకృతి మారటంతో పాటు నేల గుల్లగా తయారువుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని, కోశస్థ దశలో ఉన్న పురుగులు బయటకు వచ్చి ఎండ వేడిమికి చనిపోతాయని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆక్సిజన్ నేల లోపలి పొరలోకి ప్రవేశిస్తుందని, దీంతో మొక్కలు ఏపుగా పెరుగుతాయని వివరిస్తున్నారు. వేసవి దుక్కులు దున్ని వర్షం పడిన వెంటనే విత్తనాలను విత్తుకోవడం వలన మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

సేంద్రియ ఎరువులు, నల్లమట్టి వినియోగం

ఖరీఫ్ పంటసాగుకు పొలాల్లో భూసారాన్ని పెంపొందించేందుకు రైతులు సేంద్రియ ఎరువైన పశువుల పేడ, నల్ల మట్టిని ఉపయోగిస్తున్నారు. మొగుళ్లపల్లి మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలతో పాటు ఇతర పంటలు సాగు చేస్తారు. ఇప్పటికే రైతులు చెరువుల్లోని నల్ల మట్టిని వేసవి దుక్కుల్లో వేసి చదును చేస్తున్నారు. దీంతో అధిక భూసారం పెరిగి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు.

భూసారం పెరుగుతుంది



ఖరీఫ్ ప్రారంభానికి ముందు దుక్కులు దున్నడం ద్వారా భూసారం పెరిగి పంటలకు ఎంతో మేలు చేకురుతుంది. నాకున్న రెండు ఎకరాల పొలంలో ప్రతీ ఏడాది వేసవిలోనే దుక్కి దున్నుతున్నాను. దీని వలన భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

-అరికంతాపు అన్నారెడ్డి, రైతు

పంటలకు ఎంతో మేలు



ఖరీఫ్ పంట సాగుకు ముందుగానే వేసవి దుక్కులు దున్నడం ద్వారా సాగు భూములు సారవంతంగా అవడమే కాకుండా చీడపీడలు నశిస్తాయి. పత్తి, మొక్కజొన్న, వరి సాగు చేసే భూముల్లో వేసవిలోనే దుక్కులు దున్నడంతో పురుగు మందుల అవసరం కూడా ఎక్కువగా ఉండదు. పంట దిగుబడులు పెరుగుతాయి.

- వీరమల్లు, రైతు, మొగుళ్లపల్లి

సేంద్రియ ఎరువులపై దృష్టి



రైతులు వీలైనంతగా సేంద్రియ ఎరువులపై దృష్టి సారిస్తే మంచి దిగుబడులు వస్తాయి. ఖరీఫ్ ప్రారంభానికి ముందు వేసవిలో దుక్కులు దున్నితే రైతుకు ఎంతో మేలు చేకూరుతుంది. భూమిలో తేమ శాతం నిలకడగా ఉంటే విత్తనాలు మొలకెత్తిన సమయంలో మొక్కకు ఎంతో మేలు జరుగుతుంది. దుక్కులు దున్నుకొని భూసారాన్ని పెంపొందించే విధంగా సేంద్రియ ఎరువులను వేసుకోవాలి.

- సురేందర్‌రెడ్డి, ఏఓ, మొగుళ్లపల్లి

నిజాయితీ చాటుకున్న యువకుడు

కాటారం: రోడ్డుపై దొరికిన ఐ ఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. కేసముద్రంకు చెందిన ప్రణీత్ కాటారం హెచ్‌పీ పెట్రోల్‌బంకులో పెట్రోల్ పోయించుకొని వరంగల్‌కు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో తన ఐ ఫోన్ పడిపోగా కాటారంకు చెందిన విజయ్‌కుమార్‌కు దొరికింది. దీంతో విజయ్‌కుమార్ కాటారం పోలీసులకు అప్పగించాడు. తన ఐ ఫోన్ పోయిందని సదురు బాధితుడు కాటారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కానిస్టేబళ్లు హరికుమార్, లవన్‌లు ఫోన్‌ను బాధితుడికి అందించారు. ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన విజయ్‌కుమార్‌ను పోలీసులు అభినందించారు.



ఫోన్ అందజేస్తున్న విజయ్‌కుమార్, పోలీసులు

పుస్తెమట్టెలు అందజేత

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన నిరుపేద యువతి వివాహానికి జీకేఆర్(జి.కోన రాజశేఖర్) ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన మొలంగిరి మల్లక్క– కిష్టయ్య దంపతులు నిరుపేదలు కావడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండగా కుమార్తె వనిత వివాహం జరిపించడం ఇబ్బందిగా మారింది. దీంతో మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్ ద్వారా సమాచారం తెలుసుకున్న జీకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు, మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, డాక్టర్ ప్రతాపగిరి ప్రసాద్, నాగరాజులు బుధవారం సదురు యువతి వివాహానికి హాజరయ్యారు. ఫౌండేషన్ ద్వారా పుస్తెమట్టెలు, పూలుపండ్లు, నూతన వస్త్రాలు, నగదును సహాయంగా అందించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి ఫౌండేషన్, మేదరి సంఘం ద్వారా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మేదరి సంఘం మండల అధ్యక్షుడు పాడి రాజయ్య, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాల వేణుగోపాల్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీధర్, పాడి సరోజన, రేపాల వెంకటమ్మ, పాడి రమేశ్, రాజేశ్వర్, మేదరి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



పుస్తె మట్టెలు, నగదు అందిస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పలిమెల: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం మండలం కేంద్రంలో సైబర్ జాగృతి దివస్‌ను పురస్కరించుకొని ఎస్సై అరుణ్ సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫేక్ కాల్స్‌కు, ఓటీపీలు, పాస్‌వార్డులు కానీ ఇతరులతో పంచుకోవడం చేయవద్దన్నారు. ఓఎల్‌ఎక్స్ మోసాల భారినపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హనీట్రాప్‌లపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్స్ మిస్సింగ్ కేసులు పెరగడంతో సీఈఐఆర్ పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అరుణ్

చెరువుల పండుగను బహిష్కరిస్తాం..

కాటారం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు(గురువారం) నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని మండలంలోని సర్పంచ్‌లు అందరు కలిసి బహిష్కరించనున్నట్లు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తెప్పెల దేవేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ కారణంగా మండలంలోని దామెరకుంట, గుండ్రాత్‌పల్లి, విలసాగర్ గ్రామాల్లోని వందలాది ఎకరాలు నీట మునిగి రైతులకు గత కొన్నేళ్లుగా ఎనలేని నష్టం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో ఈ ప్రాంత రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, చుక్క నీరందించిన దాఖలాలు లేవన్నారు. మూడు గ్రామపంచాయతీలు నిత్యం ముంపునకు గురవుతూ బిక్కు బిక్కుమంటూ ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సాగునీటి సమస్యలు ఇన్ని ఉండగా ఎలాంటి పరిష్కారం చూపకుండా ప్రభుత్వం సాగునీటి ఉత్సవాలు, చెరువుల పండుగలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. దశాబ్ది ఉత్సవాలను బహిష్కరిస్తూ సర్పంచ్‌లందరం కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

మల్హర్: గ్రామ దేవతలైన భూలక్ష్మి, శ్రీలక్ష్మి దీవెనలతో ప్రజలు సంతోషంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దతూండ్లలో బుధవారం కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామదేవతల దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనకు తనవంతుగా సాయం చేస్తానని, ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళం అందించారు. అనంతరం పెద్దతూండ్ల, తాడిచర్లలో ఆకస్మికంగా మంటలు చెలరేగుతున్న విషయాన్ని తెలుసుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి గీట్ల శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సునీల్‌రెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాల్లో దశాబ్ది ఉత్సవాలు

చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ అవంతి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఐసీడీఎస్ చేపట్టిన కార్యక్రమాల్లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. అందులో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ఒక్క పూట భోజనం అందించడంతో పాటు ప్రసవం జరిగే వరకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్ అందిస్తున్నామని, ఆడ పిల్ల జన్మిస్తే రూ. 13 వేలు, మగ బిడ్డ జన్మిస్తే రూ. 12 వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే మహిళలపై జరిగే అత్యాచారాలను అరికట్టేందుకు మహిళా శక్తి కేంద్రాలను, సఖీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామన్నారు. అలాగే చిన్నారులు పోషకాహారలోపానికి గురికాకుండా బాలమృతం, కోడిగుడ్లు అందిస్తున్నామని అన్నారు. దివ్యాంగులకు వివిధ రకాల పరికరాలను అందించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం గ్రామంలోని నలుగురు గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బానోత్ జవహర్‌లాల్, ఉప సర్పంచ్ నగవత్ సునీత, సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.



కాటారం: సీమంతాలు చేస్తున్న సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి

కాటారం: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహదేవపూర్ సీడీపీఓ రాధిక సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పిల్లలకు, తల్లులకు వరంగా మారిందన్నారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు, తల్లులకు సమతూల్య ఆహారం అందుతుందన్నారు. రెండు సంవత్సరాలు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. రక్తహీనత నివారణకు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని కిషోరబాలికలకు అవగాహన కల్పించారు. మేరిలైఫ్‌లో భాగంగా ప్లాస్టిక్ వస్తువులతో జరిగే నష్టం గురించి వివరించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీణ, ఏఎన్‌ఎం రజిత, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, ప్రమీల, రోజ, ఆశావర్కర్ జ్యోతి, హెల్పర్లు లక్ష్మి, తులసి, రజిత, సీఏ రజిత,పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల, మందలవారిపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, వరుణ, పద్మ, శైలజ, ఆయాలు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్టాపూర్(టి)లో..

మండలంలోని రామకృష్టాపూర్(టి) గ్రామంలో 1, 2వ అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రసన్న కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, అంగన్‌వాడీ టీచర్స్ స్వరూప, వినీత, ఆయాలు స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి



దుబ్యాలలో..



రామకృష్టాపూర్‌లో..

తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి చెరువు పరిసరాల్లో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పక్కనే ఉన్న ఇళ్ల పరిసరాలకు మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే ఫైర్‌ఇంజన్‌కు సమాచారం అందించారు. మంటలు వ్యాపించకుండా నీళ్లు చల్లారు. సంఘటన స్థలానికి ఫైరింజన్ చేసుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు.

కార్మికులకు యూనిఫాం పంపిణీ

పలిమెల: గ్రామపంచాయతీ పరిధిలో విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికులకు పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత బుధవారం ఏకరూప దుస్తులు (యూనిఫామ్) అందించారు. మండల కేంద్రంలోని పలిమెల గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన దుస్తులను పారిశుధ్య కార్మికులకు అందించినట్లు సర్పంచ్ తెలిపారు. పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తించే సమయంలో తప్పకుండా యూనిఫామ్‌లు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, వార్డు సభ్యులు సూరిబాబు, నాయకులు దుర్గయ్య, అనిల్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ అందజేస్తున్న సర్పంచ్ పుష్పలత

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ సోదరుడు లక్ష్మయ్య మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సీతక్క బుధవారం పరామర్శించారు. లక్ష్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రాస మల్లయ్య కుటుంబాన్ని సీతక్క పరామర్శించారు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చిట్యాల: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సాయిసుధ, ఉపాధ్యాయులు



కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రమేష్ నాయక్



మహాముత్తారంలో..

మల్హర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కొయ్యూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావుడియా రమేష్ నాయక్ అన్నారు. కొయ్యూరు గ్రామంలో బుధవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొయ్యూరు పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎడ్ల రవి, ఉపాధ్యాయులు శారద, విద్యార్థుల తల్లిదండ్రులు మధుసూదన్, మహేందర్, మల్లయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని నవాబుపేట ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు కలిగి ఉన్నాయని విద్యార్థులు చక్కగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలని సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుసునపు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి పాఠశాలను ఉన్నతంగా తీర్చిద్దినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే సకల సౌకర్యాలు కలిగి ఉన్నాయని, అలాగే ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు ఎక్కడో చదువుకోవాల్సిన అవసరం లేదని, ఉన్న ఊరులో చక్కటి పాఠశాల ఉందని అందులో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దొడ్డ ఆదర్శ్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించాలని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లకర్తి, కాసులపహడ్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వాడవాడలు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు గురించి గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, రవీందర్, కే.శ్రీధర్ స్వామి, మధుసూదన్, రాజయ్య, రవి ప్రసాద్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండల కేంద్రంలోని 1, 4వ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు యత్నారంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బాడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన లభిస్తుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, రాజేశ్వరి, స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయదారుల అరెస్టు



ములుగు రూరల్: గుడుంబా విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత తెలిపారు. మండంలోని మల్లంపల్లి, రాంనగర్ గ్రామాలలో బుధవారం దాడులు నిర్వహించగా ఏడుగురు పట్టుబడినట్లు పేర్కొన్నారు. కొంగరి లక్ష్మి, నాగుల స్రవంతి, రమ, రాజయ్య, అజ్మీరా రాజమ్మ, తిరుమల, రంగమ్మలను అదుపులోకి తీసుకొని 23 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, కేసులు నమోదు చేసి ములుగు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.